క్లుప్తంగా...

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

ఘట్‌కేసర్: గ్రామసభ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కొర్రెముల్‌కు చెందిన పలువురు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సమయానికి గ్రామ సభలు నిర్వహించడం లేదని, తూతూమంత్రంగా సభ పెట్టి కొందరి సంతకాలు తీసుకుంటున్నారని, నిత్యం కార్యాలయానికి రావడంలేదని, సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని ఆరోపించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, హరితహారంపై పట్టింపు లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీటీసీ రామారావు, లింగంయాదవ్

ఘట్‌కేసర్: చౌదరిగూడలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన దోటి నరసమ్మ, వెంకటాద్రి టౌన్‌షిప్‌నకు చెందిన అప్పారావు కుటుంబీకులను మంత్రి మల్లారెడ్డి ఆదేశానుసారం ఎంపీటీసీ రామారావుముదిరాజ్, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, బీఆర్ఎస్ స్థానిక శాఖ అధ్యక్షుడు లింగంయాదవ్ బాధితుల ఇంటికెళ్లి సోమవారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలను అందజేశారు. మాజీ సర్పంచ్ రాములుగౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి ట్రస్ట్ సభ్యుడు వేణుగోవింద్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బొక్కోనిగూడకు చెందిన కృష్ణారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని సర్వే నంబర్లు 1134–1149 వరకు ఉన్న వెంచర్లలోని ప్లాట్లను పార్కు స్థలాలుగా చూపిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అక్రమార్కులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌ను కలిసి ఆటో యూనియన్ నాయకులు

మేడ్చల్: పట్టణంలోని ఆటో స్టాండ్‌లలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్‌కేవీ ఆటో యూనియన్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు విజయరావు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావును కలిశారు. మున్సిపల్ కమిషనర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి సమస్యలను విన్నవించి సన్మానించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కమిషనర్ కోరారు.

బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్

శామీర్‌పేట్: శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 14న రాష్ట్ర బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 52–54 కిలోల పోటీల్లో గురుకుల కళాశాలకు చెందిన వర్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించడంతో జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ ఇష్రాత్ తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం వర్షితను అభినందించింది.

ఐసీఎస్ఈలో సమారిటన్ విద్యార్థుల ప్రతిభ



అల్వాల్: ఐసీఎస్ఈ పదవ తరగతి పరీక్షల్లో నేరేడ్‌మెట్‌లోని సమారిటన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల డైరెక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, విద్యార్థిని వేదలింగా 95 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటాలి.. రాష్ట్రస్థాయికి చేరాలి..



కీసరగుట్టలో క్రీడాకారులతో మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్‌లో కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో మంత్రి మల్లారెడ్డి

- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్
- పలుచోట్ల క్రీడాపోటీలను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పేరిట ఆటల పోటీలు నిర్వహిస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతోమంది యువకులు నైపుణ్యం కలిగి ఉన్నా వారికి అవకాశాలు రాకపోవడంతో క్రీడల్లో వెనుకబడుతున్నారని, వారిలోని ప్రతిభను వెలికి తీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. గ్రామాల నుంచి జట్లు ఏర్పాటు చేసి మండలస్థాయి, ఆ తర్వాత జిల్లా స్థాయి, అనంతరం రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులు ఆటలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకటేషం, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ఎంపీడీఓ పద్మావతి, సర్పంచ్‌లు కవిత జీవన్, బాబు యాదవ్, నర్మద గోపాల్‌రెడ్డి, గీత భాగ్యారెడ్డి, ఎంపీటీసీలు ప్రకాష్, రఘు, అధికారులు పాల్గొన్నారు.

కరాటేలో మరింత రాణించాలి

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన మేడ్చల్ విద్యార్థులను మంత్రి మల్లారెడ్డి అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కరాటేలో మరింత రాణించి మేడ్చల్‌కు, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, నందారెడ్డి, నర్సింహారెడ్డి, దర్శన్, సత్యనారయణ, శైలజఅశోక్, భాస్కర్‌యాదవ్, కోచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లిలో..

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో సోమవారం మంత్రి మల్లారెడ్డి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హారికమురళీగౌడ్, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ జాం రవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కీసరగుట్టలోని గురుకుల పాఠశాల ఆవరణలో..

కీసర: కీసరగుట్టలోని గురుకుల పాఠశాల ఆవరణలో సోమవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు మాధురివెంకటేష్, విమలనాగరాజు, పుట్టరాజు, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, మాజీ ఎంపీపీ సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యులు జంగయ్యయాదవ్, రమేష్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నేతలు రమేష్‌గుప్తా, వెంకట్రామిరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, భానుచందర్ పాల్గొన్నారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ క్రీడలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణారెడ్డి, సర్పంచులు సురేశ్, వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శివశంకర్, ఎంపీటీసీలు సరళ, రవి, భాస్కర్‌రెడ్డి, శోభారాణి, రామారావుముదిరాజ్, ఎంఈఓ శశిధర్, ఉప సర్పంచ్ లింగేశ్వర్ రావు, జిల్లా క్రీడల కార్యదర్శి వినోద్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, అనిత, మల్లేశ్, మండలంలోని క్రీడాకారులు పాల్గొన్నారు.



ఏదులాబాద్‌లో సీఎం కప్ క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

పర్యావరణంలో జీవితాన్ని కొనసాగించాలి

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతి ఒక్కరూ పర్యావరణంలో వారి జీవితాన్ని కొనసాగించాలని, అందుకు పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన ఎంతో అవసరమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలిపై జిల్లా అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని కోరారు. మనం తీసుకునే నీటి నుంచి మొదలుకొని అన్నింటిలోనూ పర్యావరణానికి హాని కలిగించేవి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దుమ్ము, ధూళి, పొగ వంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన శైలి వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారి రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వకర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

మల్లాపూర్: విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని విశ్వకర్మలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి అన్నారు. సోమవారం మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో బీజేపీ తెలంగాణ– విశ్వకర్మ సెల్, పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశంలో కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని విశ్వకర్మలు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. విశ్వకర్మల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. ఇప్పటి వరకు విశ్వకర్మలకు ఎటువంటి లోన్ ఇవ్వలేదన్నారు. కర్ర, యంత్రాలపై అధిక పన్నులు వసూలు చేస్తూ వారిని వృత్తికి దూరం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్‌కు త్వరలోనే ఫేర్‌వెల్ కడతామన్నారు. విశ్వకర్మ శక్తిని చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, తెలంగాణ తప్ప అన్ని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు బాగుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా రూ.5 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. రాష్ట్ర విశ్వకర్మ సెల్ కన్వీనర్ పుసాల బ్రహ్మాచారి, కో కన్వీనర్ పడకంటి బ్రహ్మచారి గోవర్ధన్‌చారి, దరువు అంజన్న, సోమన్న, శ్రీనివాసాచారి, వీరబ్రహ్మం, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విలాసాలకు అలవాటుపడి చోరీలు

- 6 తులాల బంగారు ఆభరణాలు, 2.5 కేజీల వెండి, నగదు స్వాధీనం
- ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



జవహర్‌నగర్ పీఎస్‌లో వివరాలు వెలువరిస్తున్న సీఐ సీతారాం, డీఐ మధుకుమార్

జవహర్‌నగర్: విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి చోరీల బాట పట్టిన ఇద్దరు నిందితులను జవహర్‌నగర్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ సీతారాం, డీఐ మధుకుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌కు చెందిన ఏ-1 షేక్ మస్తాన్‌వలీ అలియాస్ శ్రీధర్, అలియాస్ చెర్కూరి పెద్ద పీరయ్య(36), ఏ-2 వేమూరి శ్రీనివాసులు(42)పై జవహర్‌నగర్ పీఎస్‌లో ఏ-1పై 8, ఏ-2పై 4 కేసులు నమోదయ్యాయి. వీరు అద్దె ఇంట్లో ఉంటూ దమ్మాయిగూడకు ఆర్టీసీ బస్సులో వచ్చి తాళం వేసిన ఇళ్లను ఎంచుకునేవారు. అనంతరం మద్యం తాగి మస్తాన్‌వలీ చోరీ చేసేందుకు ఇంటిలోకి వెళ్లగా శ్రీనివాసులు బయట కాపలా ఉండేవాడు. చోరీ చేసిన సొత్తుతో విలాసవంతమైన జీవనం గడిపేవారు. గతంలో చోరీ సమయంలో షేక్ మస్తాన్‌వలీ ఫింగర్ ప్రింట్స్ రాచకొండ ఫింగర్ ప్రింట్స్ బృందం దగ్గర రికార్డు ఉంది. దీంతో జవహర్‌నగర్ క్రైం పోలీసులు రెజిమెంటల్ బజార్‌లో ఉన్న వారిని పట్టుకొని 6 తులాల బంగారు ఆభరణాలు, 2.5 కేజీల వెండి, 2 ల్యాప్‌ట్యాప్‌లు, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పలు పోలీస్ స్టేషన్లలో షేక్ మస్తాన్‌వలీపై 36 కేసులు ఉండగా, శ్రీనివాసులపై 42 కేసులు ఉన్నాయన్నారు. చోరీ కేసును చాకచక్యంగా ఛేదించిన జవహర్‌నగర్ సీఐ సీతారాం, డీఐ మధుకుమార్, ఎస్సై రాంబాబును సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్‌రెడ్డి అభినందించారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: ఈ నెల 17న నిర్వహించే పాలీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సెట్ కన్వీనర్ స్నేహలత తెలిపారు. పరీక్షల కోసం మేడ్చల్‌లో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిలో 2,520 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఉంటుందని చెప్పారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని, విద్యార్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని కోరారు.

జవహర్‌నగర్ అభివృద్ధికి నిధులివ్వండి



వినతి పత్రం అందజేస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పరపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌కు, మంత్రి మల్లారెడ్డి సమక్షంలో మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో ఆయనను కలిసి శ్మశానవాటిక, థీమ్ పార్కు కోసం స్థలం కేటాయించాలని లేఖలో కోరారు.

ఘనంగా బీరప్ప ఆలయ వార్షికోత్సవం



గోధుమకుంటలో బీరప్ప స్వామిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: గోధుమకుంట గ్రామంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డికి బీరప్పస్వామి ఆశీర్వచనాన్ని దేవాలయ పూజారులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్‌చైర్మన్ బెస్త వెంకటేష్, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సర్పంచులు ఆకిటి మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ రామారం సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, రాములు, చీర సురేష్, వినోద్, యాదగిరి, వార్డు సభ్యులు, కురుమ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో భూగర్భ డ్రైనేజీకి కృషి



భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. 7వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీని చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ సాయికుమార్‌తో కలిసి ప్రారంభించి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7వ వార్డును మున్సిపల్ నిధుల సహకారంతో అభివృద్ధి పథంలో నడుపుతున్నానని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. వార్డు మొత్తం మేడ్చల్ పాత ప్రాంతం కావడంతో మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మెజార్టీ మురుగు కాల్వలు భూగర్భ కాల్వలుగా మార్చామని, సంపూర్ణ భూగర్భ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఓపెన్ మురుగు కాల్వలు లేకుండా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, ఆర్ఓ రాంచందర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి



దమ్మాయిగూడ కమిషనర్ స్వామికి వినతిపత్రం అందజేస్తూ..

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకే కాలనీకి కేటాయించిన సుమారు 7 ఎకరాల శ్మశానవాటిక స్థలం అన్యాక్రాంతం అవుతోందని సదరు శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ స్వామికి సోమవారం ఆర్‌జీకే కాలనీకి చెందిన కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ముప్పు రామారావు, వరగంటి వెంకటేష్, ఈగ శ్వేతరాజ్, సంజీవరెడ్డి తదితరులు మాట్లాడుతూ నిరుపేదలు నివసించే ఆర్‌జీకే కాలనీకి సమీపంలో సుమారు 7 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని శ్మశానవాటిక కోసం అప్పట్లో కేటాయించారన్నారు. ఇటీవల కాలంలో రాంకీ సంస్థ శ్మశానవాటికకు సంబంధించిన స్థలంలో చెత్తడంపింగ్ వ్యర్థాలను డంప్ చేయిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజావాణి ఓ బూటకం

కాంగ్రెస్ నేత హరివర్ధన్‌రెడ్డి ఆరోపణ



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో కలెక్టర్, జిల్లా అడిషనల్ కలెక్టర్లు, ముఖ్యమైన జిల్లా అధికారులు పాల్గొనకపోవడం దురదృష్టకరమని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజావాణిలో ఫిర్యాదులు, దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలతో ఆయన ముచ్చటించారు. గత సంవత్సర కాలం నుంచి ప్రజలు అందజేసిన సుమారు 3,500 వినతుల్లో 20 శాతం కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆయన ఆరోపించారు. అధికారులు ధరణి సమస్యలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతుంటే కళ్లు మూసుకుంటున్న అధికారులు పేదలపై మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ధరణి వల్ల ఎంతోమంది పేద రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని, దీన్ని అడ్డం పెట్టుకుని అధికారులు, అధికార పార్టీ నాయకులు దోపిడీకి తెర తీస్తున్నారన్నారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 122 సమస్యలపై ఫిర్యాదులు

జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యా నాయక్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి 122 సమస్యలపై జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ ఫిర్యాదులు స్వీకరించారు. మండుటెండల్లో జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తరలిచ్చిన ప్రజలు తమ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందజేయడంపై సంబంధిత అధికారుల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ లింగ్యానాయక్ మాట్లాడుతూ తమ శాఖలకు చెందిన అర్జీలను సంబంధించి అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఏవైనా ఫిర్యాదుల దరఖాస్తులు తిరస్కరించినట్లయితే వాటికి సంబంధించి సమాచారాన్ని వారికి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీవో మోహన్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లను కాపాడాలని సొసైటీ సభ్యుల ధర్నా



సాక్షి, మేడ్చల్ జిల్లా: బహదూర్‌పల్లిలో 40 ఏళ్ల కిందట ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తమ స్థలాలను ప్రభుత్వ భూములని రెవెన్యూ అధికారులు జులూం చేస్తున్నారని సోమవారం కలెక్టరేట్ వద్ద బహదూర్‌పల్లి సాయినాథ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు ధర్నా నిర్వహించారు. తమ సొసైటీ ఇళ్లను కాపాడటంతోపాటు ప్రభుత్వ భూములు అంటూ జులూం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు వారు వినతి పత్రం అందజేశారు. సొసైటీ సభ్యుల ఆందోళనకు టీపీసీసీ నేత హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ధర్నాలో వారు భాగస్వామ్యాన్ని పంచుకున్నారు.

బస్సు ఢీకొందని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



మాట్లాడుతున్న డీసీపీ జానకి, పోలీస్ అధికారులు

మేడిపల్లి: బస్సు కారును ఢీకొందన్న కోపంతో కారులో ఉన్న ఏడుగురు యువకులు బస్సును అడ్డగించి ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై దాడిచేసి, నగదు దోపిడీ చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకి మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును నారపల్లి వద్ద ఆపారు. మారుతి ఎర్టిగా కారును బస్సు ఢీకొందని డ్రైవర్‌పై కార్వాన్, మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు కొడిదల సరేష్(19), పల్లా పవన్(23), పల్లపు రాజు(22), పల్లపు ప్రమోద్(22), సానిపాయ రవి(24), పల్లపు నవీన్(23), పల్లపు నవీన్(26) దాడి చేసి రూ.13,690 నగదును దోచుకెళ్లారు. బస్సులోని ప్రయాణికులు డ్రైవర్‌ను రక్షించే ప్రయత్నం చేయగా వారిని సైతం దుర్భాషలాడుతూ బస్సు టైర్ గాలితీసి కారులో పారిపోయారు. ఓ వ్యక్తి డయల్ 100కు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సికింద్రాబాద్ సమీపంలో కవాడిగూడ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నగదు, ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మేడిపల్లి పోలీసులను డీసీపీ జానకి అభినందించారు. కార్యక్రమంలో ఏసీపి నరేష్ రెడ్డి, సీఐ గోవర్ధనగిరి, డీఐ ప్రవీన్ బాబు, డీఎస్ఐ లక్ష్మణ్, ఎస్ఐ మల్లీశ్వరి, తిరుపతిరెడ్డి, కృష్ణయ్య, అమర్‌సింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.